కామెడీ కథ

# సుబ్బాయమ్మ - టి.వి. ప్రోగ్రాం

**కె.రాజేశ్వరి**

**ఇల్లంతా ఒకటే సందడి. అందరం హడావుడిగా ఎవరి పనుల్లో వాళ్లు యమా బిజీగా తిరుగుతున్నాం.**

''అదేమిటండి? ఇంకా గుమ్మాలకి మామిడి తోరణాలు కూడా కట్ట లేదు. పత్రి, అరటి పిలకలన్నా తెప్పించారా...అదీలేదా? మీతో ఇదే తంటా. ఏదీ చెప్పినట్లైంకి చెయ్యరు'' రుసరుసలాడింది నా భార్యామణి సదరు సుబ్బాయమ్మ.

''అబ్బ... అన్నీ వచ్చాయి కానీ నువ్వూరికే కంగారు పడకు'' అన్నాను వినాయకుడి పైన పాలవెల్లి కడుతూ.

''ఏం కంగారో ఏమిటో...అవతల వాళ్లొచ్చే టైమవు తుంటేను...'' అంటూ ఉండగానే ఇంటి ముందు కారాగింది.

''రండి...రండి... మీ కోసమే చూస్తున్నాం'' అంటూ ఫుల్ మేకప్‌లో సినీస్టార్‌లా స్టైల్‌గా ఉన్నామెని తీసు కొని లోపలికి వెళ్లింది.

ఎవరబ్బా! ఎప్పుడు చూడలేదే...అనుకున్నాను.

ఈ హడావుడంతా ఎందుకనుకుంటున్నారు...ఇవాళ మా ఇంట్లో మాకు మాత్రమే వినాయకచవితి పండగ.

అదేమిటి...మా ఇంట్లో మాకు మాత్రమే అన్నానే మిటా అనుకుంటున్నారా?

అవునండి మరి. మా శ్రీమతి పుణ్యమా అని పండుగ ఇంకో నెల ఉంటే ముందుగానే మేము వినా యకచవితి జరుపుకుంటున్నాము. ఎందుకంటారా?

దీనికో ఫ్లాష్‌బ్యాక్ స్టోరీ ఉంది లెండి.

ఈ మధ్య ఎప్పుడో మా సుబ్బువాళ్ల ఫ్రెండ్ వాళ్లింట్లో 'ఆ టీవీ వాళ్లు' మిసెస్ 'సౌభాగ్యశ్రీ' అనే లేడీస్ ప్రోగ్రాంని షూట్ చేసి టీవీలో ప్రసారం చేశారట. ఆ ప్రోగ్రాంలో పాల్గొన్న వాళ్లకి గోల్డుకాయిన్స్, మంచి మంచి చీరలు బహుమతులుగా ఇచ్చారట. 'ఆ టీవీ'లో వాళ్ల ప్రోగ్రాం చూసి మా సుబ్బు తెగ తబ్బిబ్బయిపోయి ఆ ఫ్రెండ్‌కి ఫోన్ చేసి వివరాలు కనుక్కొని తను కూడా టీవీలో కనపడవచ్చు. తేరగా గోల్డు కాయిన్స్, చీరలు కొట్టేయవచ్చనే ఆశతో 'ఆ టీవీ' వాళ్లని మా ఇంటిక్కూడా రమ్మని ఆహ్వానించిందట. సదరు టీవీవాళ్లు ఇంకో నెల్లో వినాయకచవితి పండుగ ఉంది కదా...ఆ పండుగ జరుపుకొంటు న్నట్లు అన్ని ఏర్పాట్లు చేసుకుంటే షూట్ చేసి పండుగ రోజు టెలికాస్ట్ చేస్తాం అన్నారట. వెంటనే మా సుబ్బు 'సై' అందిట.

దాందేం పోయింది మరి. దేనికైనా సరే అంటుంది. ఎంకిపెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు మా ఆవిడ కోరి కేమోగానీ మధ్య నాకు తిప్పలొచ్చాయి.

బలవంతాన రెండ్రోజులు నా చేత ఆఫీసుకి లీవ్ పెట్టించి ఇల్లంతా సర్దించింది. ఇల్లు సర్దటమేమో కానీ వినాయకుడి విగ్రహం, పత్రి, పాలవెల్లి కొనా లంటే నా తల ప్రాణం తోక్కి వచ్చింది. పండుగ రోజైతే ఎక్కడ చూసినా రోడ్ల నిండా వినాయకుడి విగ్రహాలు, పత్రి దొరికేవి. మాది పండగ కాని పండగాయె. ఇక చూడండి నా అవస్థ.

ఊరంతా వినాయకుడి విగ్రహాల కోసం పత్రి కోసం పిచ్చివాడిలా తిరుగుతున్న నన్ను చూసి తెలిసిన వాళ్లు, తెలియనివాళ్లు నవ్వుతుంటే నిజం చెప్పొద్దూ నాకు నిజ్జంగా మా సుబ్బు మీద పీకలదాకా కోపం వచ్చింది. కానీ ఏం చేయను మరి. మా సుబ్బు ఏదైనా తలుచుకున్నదంటే అది సాధించిందాకా నిద్ర పోదు మరి.

''ఏమండోయ్...మిమ్మల్నే... ఏ లోకంలో ఉన్నారు?'' అన్న భార్యామణి మాటలకి ఉలిక్కిపడి- ''ఏమి టోయ్?'' అన్నాను.

''ఓ ఫిఫ్టీన్ హండ్రెడ్ ఇవ్వండి''

''పదిహేను వందలా... దేనికి?''

''బ్యూటీషియన్‌కి ఇవ్వాలి''

''అదేంటి. మొన్న ఐదొందలు తీసుకెళ్లావుగా బ్యూటీ పార్లర్‌కని'' గుమ్మానికి తోరణం కడుతూ అడి గాను.

''మొన్నటివి ఫేషియల్‌కి, ఐబ్రో షేపింగ్‌కి, మెహందీ డిజైన్‌కి సరిపోయాయి. ఇప్పుడివి మా అందరికీ మేకప్ చేసినందుకు''

ఇప్పుడొచ్చినామె బ్యూటీషియన్ కాబోలు అను కొంటూ ''అందరూ మేకప్ చేయించుకుంటే నాకెం దుకు ఖర్చు? ఎవరి డబ్బులు వాళ్లని ఇమ్మను'' అన్నాను మేకప్‌తో మెరిసిపోతున్న మా సుబ్బు మొహం చూస్తూ.

''మీ పీనాసితనం పాడుగాను. పెద్దగా అరవకండి. తర్వాత ఇస్తార్లే..'' అన్నది.

'దీని టీవీ పిచ్చి ఏమోగానీ నాలుగు రోజుల్నుండి నా జేబులు తెగ ఖాళీ చేయిస్తోంది. నిండా మునిగాక చలేమిటి' అనుకొంటూ ఏడుపు మొహం పెట్టి పది హేను వందలు తీసిచ్చాను.

మా సుబ్బు వాళ్ల అమ్మ, అక్క, చెల్లి, సుబ్బు క్లోజ్ ఫ్రెండ్ కోమలి...వీళ్లల్లో ఎవరంట తర్వాత నాకు డబ్బు లిచ్చేది... విరక్తిగా నవ్వుకున్నాను.

హాల్లో ఓ మూల నేను అందంగా అలంకరించిన వినాయకుడి విగ్రహం ముందు రెడీగా ఉన్న పిండి వంటలన్నీ ప్లేట్లల్లో పెట్టింది. హాలు మధ్యలోకి సోఫా సెట్ జరిపి దానిముందో టీపాయ్ ఉంచి, ఈ ప్రోగ్రాం కోసమని ప్రత్యేకంగా కొన్న అందమైన ఫ్లవర్‌వాజ్‌ని టీపాయ్ మీద సర్దింది. గదంతా ఓసారి తృప్తిగా చూసుకొని నా వైపు తిరిగి ''ఏమిటండీ మీరింకా అలానే ఉన్నారు? అవతల వాళ్లొచ్చే టైమవుతోంది. త్వరగా రెడీ అవ్వండి'' అని హడావుడి చేసింది.

నేను రెడీ అయి వచ్చానో లేదో బయట కారు హారన్ వినిపించింది.

మా సుబ్బు పరుగెత్తుకొంటూ వెళ్లి ''రండి...రండి..'' అంటూ 'ఆ టీవీ' వాళ్లని ఆహ్వానించింది.

ముందుగా యాంకరమ్మ, ఆమె వెనుక నలుగురైదుగురు టెక్నీషియన్స్, కెమేరామెన్ బిలబిల మంటూ లోపలికి వచ్చారు. ఈ హడావుడికి అప్పటివరకు గదిలోనే ఉన్న మా ఆడపటాలం అంతా హాల్లోకి వచ్చారు.

కూర్చోండి అని మా వారు, మా అమ్మగారు, అక్క, చెల్లి, ఫ్రెండ్ అని పేరుపేరునా అందర్నీ ఆమెకి పరిచయం చేసింది. ''ఆ టీవీ యాంకర్ ప్రీతిరెడ్డి అంటే ఈవిడేనండి. యాంకరింగు చాలా బాగా చేస్తారు'' అంటూ మా అందరికీ ఆమెని పరిచయం చేసింది మా సుబ్బు.



"ఊ!
ప్రోగ్రాం స్టార్టు చేద్దామా?" కళ్లు తిప్పుతూ అడిగింది ప్రీతిరెడ్డి.

"ఉండండి. ఇప్పుడేగా వచ్చారు. కాస్త కాఫీ, టిఫిన్..."

"నే...నే... ఇప్పుడలాంటివన్నీ పెట్టుకోకండి" అని ఆమె అంటున్నా వినకుండా మా సుబ్బు కూల్ డ్రింక్సు తెచ్చి-

"కనీసం ఇవన్నా తీసుకోండి. మా తృప్తి కోసం... ప్లీజ్..." అంటూ అందరికీ డ్రింక్స్ ఇచ్చింది.

"అందరూ రెడీయేనా...? ఇక స్టార్ట్ చేద్దామా...?" ఖాళీ సీసాని కింద పెడుతూ అడిగింది ప్రీతిరెడ్డి.

అందరూ ఓసారి చీరలు, నగలు సరిచేసుకొని "రెడీ" అన్నారు.

ఫుల్ మేకప్‌తో పట్టుచీరలు, నగలతో మెరిసిపోతున్నారందరూ.

'ఆ టీవీ' ట్రూప్ మొత్తం బయటికి వెళ్లి తలుపు వేశారు.

ఇదేమిటి... షూటింగు తీస్తామని అలా బయటకెళ్లి తలుపులేశారు. కొంపదీసి బయట నుండి ఏ కిటికీ సందుల్లో నుండో తీస్తారా ఏమిటి? అనుకొంటూ ఉండగానే 'టక్...టక్' మని తలుపు చప్పుడైంది.

మా సుబ్బు వెళ్లి టూత్‌పేస్టు ఎడ్వర్‌టైజ్‌మెంటులా పళ్లన్నీ కనిపించేలా నవ్వుతూ "రండి...రండి...మీకోసమే ఎదురుచూస్తున్నాం" అని ఆహ్వానించింది.

"ముందుగా అందరికీ వినాయకచవితి శుభాకాంక్షలు. పండుగ చాలా బాగా జరుపుకొంటున్నట్లున్నారే. పూజ అయిపోయిందా?"

"లేదండి. ఇప్పుడే మొదలెట్టబోతున్నాం. ఇంతలో మీరు వచ్చారు."

"సమయానికి వచ్చామన్నమాట. సరే పదండి. ముందు పూజ చేసుకుందాం. దేవుణ్ని ఎక్కడ పెట్టారు?" అంటూ హాల్లోనే ఓ మూలగా అందంగా అలంకరించబడిన వినాయకుడి పీఠం దగ్గరకి వెళ్లారు అందరూ. వీళ్ల వెనకే కెమేరా కదిలింది.

"అబ్బో చాలా పెద్ద విగ్రహమే....వినాయకుడు చాలా అందంగా ఉన్నాడు. అలంకరణ కూడా చాలా బాగా చేశారు" మెచ్చుకుంది యాంకరమ్మ.

"ఎందుకుండదూ...? మామూలుగా పండక్కి 5 రూపాయలు పెడితే వినాయకుడి బొమ్మ వస్తుంది. ఈ ఉత్తుత్తి పండక్కి రెండొందలు పెట్టి మరీ కొనిచ్చిందాయె మా యావిడ..." లోలోపల గొణుక్కున్నాను.

అప్పటికే నూనె పోసి వత్తులు వేసి రెడీగా ఉంచిన పక్కింటి వాళ్ల నిలువెత్తు వెండికుందుల్ని వెలిగించింది మా సుబ్బు. అందరూ కలిసి "శుక్లాంబరధరం" శ్లోకం చదివారు. కొబ్బరికాయ కొట్టి హారతిచ్చారు.

"కుడుములు, ఉండ్రాళ్లు, గారెలు, బూరెలు, లడ్లు, పానకం, వడపప్పు, చక్రపొంగలి...అబ్బో.. స్వామివారి నైవేద్యానికి చాలా రకాలు చేశారే. అన్నీ మీరే చేశారా శుభశ్రీగారూ?"

"అవునండీ. అన్నీ నేనే చేశాను. నాకు వంటన్నా, పిండివంటలు చేయటమన్నా చాలా సరదా" అన్నది మా సుబ్బు కళ్లు గుండ్రంగా తిప్పుతూ.

'ఏమిటేమిటి? అన్నీ నువ్వే చేశావా... ఓసి నీ ఫోజు పాడుగాను. వంటామెకి రొండొందలిచ్చి చేయించింది చాలక అబద్ధాలు చెబుతున్నావా...? ఎంత మోసం...ఎంత మోసం...ఐనా... నువ్వు నాక్కూడా తెలియకుండా శుభశ్రీగా ఎప్పుడు మారావే భార్యామణీ?' అని తెగ హాశ్చర్యపోయాను.

అందరికీ తీర్థప్రసాదాలిచ్చాక ఆడవాళ్లంతా సోఫాల్లో సెటిలయ్యారు.

"ఉ చెప్పండి శుభశ్రీగారూ! మీ వారేం చేస్తారు? మీకు పిల్లలెంతమంది? ఏం చదువుతున్నారు...మీ మీ అలవాట్లు ఏమిటి? అందరూ ఒకరి తర్వాత ఒకరు మీమీ పరిచయాలు చేసుకొంటూ మీ గురించి చెప్పండి" అన్నది యాంకరు.

'ఇందాక ఓసారి పరిచయాలయ్యాయి కదా యాంకరమ్మ' అనుకొని మళ్లీ అంతలోనే "ఒహో, ఇప్పుడు టీవీ పరిచయాలు కాబోలు" అనుకున్నాను.

అందరూ ఎవరి బాజాలు వాళ్లు బాగా మోగించుకున్నాక "ఇప్పుడు ప్రోగ్రాం మీ అందరికీ తెలుసుగా... 'వంటా...వంటా...' మీలో ఎవరు చేస్తారు?" అడిగింది యాంకరు.

"మా అమ్మగారు చేస్తారండి. కొత్త రకం వంటలు చెయ్యటంలో ఎక్స్‌పర్ట్" అన్నది మా సుబ్బు.

"ఏం చెయ్యబోతున్నారండి?" మైకు మా అత్తగారి దగ్గరగా పెట్టి అడిగింది ప్రీతిరెడ్డి.

"కందా గుల్‌గుల్..." మా సుబ్బు చెప్పింది.

"కందా గుల్ గులా?" పేరు తమాషాగా ఉన్నదే.

"అవునండి. ఇది చైనీస్ డిష్" కళ్లు గుండ్రంగా తిప్పుతూ గొప్పగా చెప్పింది సుబ్బు.

'పేరే నా బొందలా ఉంది. ఇక తింటానికెలా ఉంటుందో? ఐనా చైనాలో కందపిలకలు దొరుకుతాయో లేదో దాంతో వాళ్లు స్వీటు చేసుకుంటారో లేదో టీవీ చూసేవాళ్లకి ఏం తెలుస్తుందిలే...' నా ఆలోచనలకి లోలోన నవ్వుకున్నాను.

"సరే పదండి" అంటూ వంటగదిలోకి నడిచారు. నేను కూడా వెళ్లి కెమేరా పక్కన నిలబడ్డాను.

"ఈ కందా గుల్‌గుల్‌కి ఏమేం కావాలండి?" ప్రీతిరెడ్డి అడిగింది.

"కంద, పంచదార, పాలు, జీడిపప్పు, పిస్తా, యాలకులు, కిస్మిస్" అంటూ చెప్పుకుపోతున్న మా అత్తగారిని చూస్తుంటే ఏమిటో నాకే కొత్తగా అనిపించింది.

'ఏమిటబ్బా ఈమెలో మార్పు?' అని ఆలోచిస్తుంటే అప్పుడర్థమైంది తలకి రంగు, ముఖానికి మేకప్పు అని.

'అత్తా! ఈ మేకప్‌లో మా ఆవిడకి అక్కలా ఉన్నావ్. ఇలా గనక మామగారు నిన్ను చూశారంటే మళ్లీ హనీమూన్ ట్రిప్‌కి రెడీ అవుతారు' నా ఆలోచనకి నవ్వుకున్నాను.

అత్తగారు ఓ అరగంట కష్టపడి తయారుచేసిన స్వీట్‌ని స్పూన్‌తో స్టైల్‌గా నోట్లో పెట్టుకొని అసలే పెద్దవైన కళ్లని ఇంకొంచెం పెద్దవిగా చేసి గుండ్రంగా తిప్పుతూ "ఊ...ఫెంటాస్టిక్. చాలా బావుంది. మీరంతా కూడా రుచి చూడండి" అంటూ నెమ్మదిగా అందరిలో నుండి బయటకు తప్పుకుంది.

అందరితో పాటు నేను కూడా కొంచెం నోట్లో వేసుకున్నాను. నాలుకంతా ఒకటే దురద. కందా గుల్ గులంట...పేరుకి తగ్గట్టే ఏడ్చింది అనుకొంటూ నోట్లోది ఊసేయటానికని బయటకి వెళ్లాను. అప్పుడర్థమైంది నాకు యాంకరమ్మ బయటకు ఎందుకు వెళ్లిందో..!

మా అత్తగారు ఆ దురద స్వీటులో వేసిన ఐటమ్స్ అన్నీ ఒక్కసారిగా కళ్లముందు మెదిలాయి. దాంతో నా గుండె జారి పాతాళంలోకి పోయినట్లయింది.

హడావుడిగా లోపలికి వచ్చి "ఇంత మంచి స్వీటుని తయారుచేసి చూపించినందుకు 'దివాలా గోల్డ్ షాపు' వారి తరపున ఓ గోల్డు కాయిన్‌ని గిఫ్టుగా ఇస్తున్నాం" అంటూ గోనె సంచి అంతున్న ఓ ప్లాస్టిక్ కవర్‌ని మా అత్తగారి చేతికిచ్చింది యాంకరమ్మ.

అందులో గోల్డుకాయిన్ ఏ మూల ఉన్నదో మరి... ఐనా ఓ చిన్న గోల్డుకాయిన్ కోసం అంత పెద్ద కవర్ అవసరమా...? అనిపించింది.

ఆడవాళ్లంతా హాల్లోకి వచ్చి మళ్లీ సోఫాల్లో సెటిలయ్యారు.

"ఇప్పుడు నెక్స్ట్ ప్రోగ్రాం 'మాటా మంతి'. నేనొక టాపిక్ చెబుతాను. దాని గురించి మీరు మాట్లాడాలి. ఎవరు బాగా మాట్లాడితే వాళ్లకి గిఫ్ట్. ఇవాళ్టి మన టాపిక్ ఏమిటంటే మీ శ్రీవారు పండగ గిఫ్టుగా ముప్పైవేలు పెట్టి ఓ మంచి నెక్లెస్ కొనుక్కొచ్చారు. పండక్కి మీ ఇంటికి వచ్చిన మీ ఆడపడుచు అది చూసి తనకది బాగా నచ్చిందని, తనకిచ్చేయమని అడుగుతుంది. అప్పుడు మీరు, మీ ఆడపడుచు ఎలా మాట్లాడుకొంటారో ఇద్దరి తరపునా మీరే మాట్లాడాలి. అర్థమైంది కదూ.. రెడీయేనా?"

"కోమలిగారూ...! ఫస్టు మీరు మాట్లాడండి" అనగానే కోమలి మైకందుకుంది.

"వదినా! వదినా! మీ అన్నయ్య నీకు నెక్లెస్ కొన్నాడట కదా. నాకు చూపించవా?"

"పని కాగానే నేనే చూపిద్దామనుకున్నాను. ఇంతలో నువ్వే అడిగావు. ఇదిగో చూడమ్మా..."

"అబ్బ. ఎంత బావుందో...ఓసారి పెట్టుకొని చూడనా వదినా?"

"పెట్టుకోమ్మా. అంతకంటేనా..."

"వదినా! నా మెడకి ఎంత బాగా నప్పిందో కదా. ప్లీజ్ వదినా! ఇది నాకిచ్చేయవా? కావాలంటే అన్నయ్యన

## ఆశావాదం

**బాలీవుడ్‌లో సినిమాల జోరు ఇప్పుడు ఊపందుకున్నట్టుంది. మాజీ అందాలసుందరి సెలీనాజైట్లీ కొత్త అవతారం ఎత్తనుంది. ఒరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న కొత్త చిత్రంలో ఆమె కీలకపాత్ర పోషిస్తోంది. దీపక్ తిజోరీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో డినో మోరియా, జిప్పీ షెర్గిల్ తదితరులు నటిస్తున్నారు. 'ఇప్పటివరకూ వినని కొత్త సబ్జెక్ట్‌తో నిర్మాణం అవుతున్న ఈ చిత్రం నా కెరీర్‌ని మలుపుతిప్పుతుంది' అని ఆశాభావం వ్యక్తం చేస్తోంది సెలీనాజైట్లీ.**



డిగి నువ్వింకోటి కొనిపించుకో. ప్లీజ్ వదినా! కాద నకు...''

"సర్లేమ్మా. అంతగా అడగాలా...తీసుకోమ్మా. నేనిం కోసారి కొనిచ్చుకుంటాలే...'' అని

"మా ఆడపడుచుకి ఇచ్చేస్తా...'' అన్నది కోమలి.

"ఇచ్చేస్తారన్నమాట. నిజంగా ఎంత మంచి మన సండి. ఆడపడుచు అడగ్గానే శ్రీవారు మీకోసమని ముచ్చటపడి తెచ్చినా సరే ఇచ్చేస్తారన్న మాట'' కళ్లు గుండ్రంగా తిప్పుతూ అమాయకంగా మొహం పెట్టి అడిగించి ప్రీతిరెడ్డి.

"అవునండి ఇచ్చేస్తాను'' గట్టిగా అన్నది కోమలి.

కోమలి సమాధానం వినేసరికి యాంకరమ్మ కళ్లతో పాటు నా కళ్లు కూడా ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. కోమలి మా సుబ్బు ఫ్రెండే కాదు. నా కొలీగ్ సురేష్‌కి భార్య కూడా.

"కోమలమ్మా! నీకింత ఉదారబుద్ధి ఎప్పుడొచ్చింది తల్లీ. నీ మాటలు నీ ఆడపడుచు కానీ విందంటేనా! వామ్మో...వాయ్యో...ఇంకేమైనా ఉందా...ఆనందం పట్టలేక ఆ వెర్రిదానికి పిచ్చిపట్టినా పట్టొచ్చు. పోయిన వారమే కదమ్మా. నీ ఆడపడుచు తన భర్తకేదో ఆపరేషన్ చేయించాలని ఓ ఐదువేలు సర్దితే తర్వాత ఇస్తానని మీ ఇంటికొచ్చింది. ఆ ఖర్చు, ఈ ఖర్చు అంటూ చేంతాడంత లిస్టొకటి చదివి వచ్చినదార్నే వట్టి చేతుల్తో పంపించావని సురేష్‌గాడు ఆఫీసులో నాతో చెప్పి వాపోయాడు కదమ్మా. ఆపదలో ఉండి ఆడపడుచు ఐదు వేలడిగితేనే ఇవ్వలేదు కానీ ముప్ఫైవేల రూపాయల నెక్లెస్ ఇస్తుందట. హు. అంతా టీవీ మాయ.''

"తర్వాత మీరు...'' అంటూ వరుసగా మా వదినని, మరదల్ని అడిగి చివరగా మా సుబ్బుని అడిగింది.

అందరూ దాదాపుగా కోమలి చెప్పినట్లే చెప్పారు. మా సుబ్బు అయితే ఇంకాస్త ముందుకెళ్లి "తీసుకోమ్మా! నీకంటేనా ...ఆడపడుచు ఆనందం కంటే మాకేం కావాలి. ఇంటి ఆడపడుచుని సంతోషపెడితే మాక్కూడా కలిసొస్తుందమ్మా. కలిసొస్తే ఇలాంటివి ఎన్నయినా కొనుక్కోవచ్చు. పండక్కి పిలిచి ఆడపిల్లని సంతోషంగా, తృప్తిగా పంపాలి కానీ బాధపెట్టి పంపకూడదు కదా'' అన్నది.

'వార్నాయనో! నీక్కూడా ఇంత మంచి బుద్ధి ఎప్పుడొచ్చిందే...ఇదంతా టీవీ స్టంటా... లేక మీ అందర్నీ పిచ్చికుక్కలాంటిదేమైనా కరిచిందా...ఈ ప్రోగ్రాం మా చెల్లి కనక చూసిందంటే వదినగారి ఉదారబుద్ధి చూసి ఆనందం పట్టలేక గుండాగి చచ్చినా చచ్చుద్ది. అసలే అర్భకపు ప్రాణి. రాకరాక ఎప్పుడన్నా అన్న ఇంటికి వస్తే ముష్టి మూడొందల్లో చీర పెట్టటానికే మూతి ముప్ఫై వంకర్లు తిప్పుతావే. కనీసం ఇప్పుడీ ప్రోగ్రాం కోసమైనా ఎక్కడో విజయవాడ, గుంటూర్లో ఉంటున్న నీ వాళ్లని పిలుచుకున్నావు గానీ దగ్గర్లోనే ఉంటున్నదాన్ని పిలవలేదే...అలాంటిది ముప్ఫై వేల రూపాయల నెక్లెస్ ఇస్తావా... ఏమి టీవీ మాయ'

"మైగాడ్! నిజంగా మీలాంటి వదినలుండటం మీ ఆడపడుచుల అదృష్టమండి. నాక్కూడా మీలాంటి వదినలు దొరికితే ఎంత బావుణ్ణు. అందరు చక్కగా మాట్లాడారు. శుభశ్రీగారు ఆడపడుచుని సంతోషపెడితే ఇంటికి శుభం కలుగుతుందని చక్కని పాయింటు చెప్పారు. అందుకని అందమైన శారీని శుభశ్రీగారికి గిఫ్టుగా ఇస్తున్నాను'' అంటూ చీర ప్యాకెట్టుని మా సుబ్బుకి ఇచ్చింది ప్రీతిరెడ్డి.


"ఇక ఇప్పుడు మీ కుట్లు, అల్లికలు లాంటివేమైనా ఉంటే చూపించండి'' అనగానే అప్పటికే టీపాయ్ కింద రెడీగా దాచి ఉంచినవన్నీ తీసింది మా సుబ్బు.

"ఇది వూల్‌తో వాకిలికి కర్టెన్ అల్లానండి. ఇది టీవీ కవర్...ఇది టేబుల్ క్లాత్..'' అని మా చెల్లి పెళ్లి కాక ముందు అల్లినవన్నీ ఒకటొకటిగా తీసి చూపించసాగింది. మూణ్నెల్లు కష్టపడి మా సుబ్బు కోసమని చెల్లి కుట్టిన చీరని చూపించి ఇది నేను డిజైన్ చేసి కుట్టానండి అంటూ చూపించింది. నిన్నకాక మొన్న హాండిక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో మూడొందలు పెట్టి కొన్న వాల్ డెకరేటివ్ పీస్ చూపించి.. "ఇది కూడా నేను తయారు చేసిందేనండీ'' అంటూ అందంగా పెట్టించుకున్న గోరింటాకు డిజైన్ అందరికీ కనపడేలా చేతులు తిప్పింది.

'ఓసి నీ బడాయి పాడుగాను. టీవీ ప్రోగ్రాం కోసం ఇన్నేసి అబద్ధాలా?' అనుకున్నాను.

## అదే ఆనందం

**'మనం నటించిన చిత్రం ప్రేక్షకుల ప్రశంసలందుకుంటే తారల కృషి ఫలించినట్టే' అంటోంది అందాలతార నమిత. 'నాయకుడు' చిత్రంలో రాజశేఖర్ సరసన నటిస్తున్న ఈ భామ ఈ సినిమా పైనే తన ఆశలన్నీ అంటోంది. గ్లామర్, పెర్ఫార్మెన్స్‌కి ప్రాధాన్యం ఉన్న ఈ చిత్రంలోని తన పాత్ర తనకి మంచి పేరు తెస్తుందని భావిస్తోంది నమిత. ఇంతకుముందు చిత్రాల్లోలాగే ఆమె అందమైన రూపం ప్రేక్షకుల్ని థియేటర్లకి రప్పిస్తుందేమో చూద్దాం.**




"ఇంత అందమైన వర్క్సు చూపించినందుకు 'చింకీ బ్రదర్స్' వారి తరపున శుభశ్రీగారికి ఓ చక్కటి శారీ గిఫ్ట్'' అంటూ ఇంకో కవరు అందించింది యాంకరు.

మా ఆవిడ విజయగర్వంతో ఉబ్బితబ్బిబ్బయి కళ్లింత పెద్దవి చేసి "నేనంటే ఏమనుకున్నారు'' అన్నట్లు దూరంగా నిలబడిన నా వైపు చూసింది.

"ఇక లాస్ట్ అండ్ ఫైనల్ రౌండ్ - ఆటాడుకుందాం..ఆడుకుందామంటారా...రెడీయేనా?'' సరదాగా అడిగింది యాంకరమ్మ.

"ఓ...రెడీ...'' అన్నారందరూ.

"ఆటంటే అంత కష్టమైనదేం కాదు. అదిగో చూడండి. ఆ టేబుల్ మీద మూడు

ప్లేట్లల్లో ద్రాక్షపళ్లున్నాయి. మీ ముగ్గురూ పసిపిల్లల్లా పాక్కుంటూ అక్కడికి వెళ్లి చేతులు వెనక్కి పెట్టుకొని ఎవరు ముందు పళ్లన్నీ తింటారో వాళ్లు గెలిచినట్లు. అర్థమైంది కదా... ఊ రెడీస్టార్ట్..." అనగానే మా మరదలు, వాళ్లక్క, కోమలి గబగబా పాకటం మొదలెట్టారు. వాళ్లలా పాకుతూ వెళ్లి కుక్కలు, పిల్లుల్లా మూతులు ప్లేట్లల్లో పెట్టి తింటుంటే నిజంగా ఆ సీన్ చూడాల్సిందే. నాకు నవ్వాగలేదంటే నమ్మండి మరి.

నేననుకున్నట్లే మా మరదలు మణికుమారి అందరికంటే ముందుగా తిని 'ఓల్డ్ అండ్ ఓల్డ్' షాపింగ్ సెంటర్ వారి ఓ మంచి శారీని గిఫ్టుగా గెలుచుకుంది.

"ఆ ఎలా ఉందండి మన ప్రోగ్రాం. బాగా ఎంజాయ్ చేశారుకదా. అన్నిట్లోకి మీకు ఏ రౌండ్ నచ్చిందండి" అంటూ అందరి అభిప్రాయాలు అడిగి తెలుసుకొని "చూశారుగా మీరు కూడా మీ 'ఆ టీవీ'లో వస్తున్న 'మిసెస్ సౌభాగ్యశ్రీ' ప్రోగ్రాంలో పాల్గొని అందమైన గిఫ్టుల్ని గెలుచుకోవాలనుకుంటే మాకు లెటర్ రాయండి" అని అడ్రస్ చెప్పి ఎంత హడావుడిగా వచ్చారో అంతే హడావుడిగా తట్టా బుట్టా సారీ! కెమెరా, మైకు సర్దుకొని వెళ్లిపోయారందరూ.

వాళ్లని గేటు వరకు సాగనంపాక అప్పుడడిగాను మా సుబ్బుని..."ఇంతకీ శుభశ్రీగా పేరెప్పుడు మార్చుకున్నావే నాక్కూడా తెలియకుండా?" అని.

"మా వాళ్లకి బుద్ధి లేక 'సుబ్బాయమ్మా' అని మొరటుగా పెడితే అది టీవీ చూసే వాళ్లందరికీ తెలియాలా ఏంటి? అందుకే స్టైల్‌గా ఉంటుందని అలా చెప్పాను."

'ఓసి నీ స్టైలు పాడుగాను' అనుకొని "ఇప్పటికే చాలా టైమయింది. ఆ గిఫ్టులన్నీ ముందేసుకొని కూర్చేక ముందు భోజనాల కార్యక్రమం చూడు" అన్నాను. ఈ ఆడవాళ్లు చీరల ముందు కూర్చున్నారంటే ఇప్పట్లో లేవరు మరి.

భోజనాలయ్యాక అందరూ ఎవరిళ్లకు వాళ్లు బయల్దేరారు. వెళ్లే ముందు మా అత్తగారు "నేనో కొత్తరకం స్వీటు చెప్తాను. చెప్పింది చెప్పినట్లు చేస్తే గోల్డుకాయిన్ గిఫ్టుగా ఇస్తారు. మా ఇంట్లో ప్రోగ్రాం కాబట్టి ఆ కాయిన్ నాకే ఇవ్వాలమ్మా అంటూ- ఒకటికి పదిసార్లు చిలక్కి చెప్పినట్లు చెప్పావుగా. ఇందా...తీసుకోమ్మా..." అంటూ తన గిఫ్ట్‌ని కూడా ఇచ్చింది.

వాళ్లా గిఫ్ట్‌ని ముందే చూశారని తెలీని మా సుబ్బు ఎంతగానో పొంగిపోయింది.

వాళ్లందర్నీ గేటువరకు సాగనంపి పట్టరాని సంతోషంతో వచ్చి ముందుగా గోల్డు కాయిన్‌ని బయటకు తీసి చూసి మూర్ఛపోయినంత పనిచేసింది.

"ఇదేమిటండి...? గోల్డుకాయినంటే కాసో అరకాసో ఉంటుందనుకున్నాను. శ్రావణ శుక్రవారం పూజలో పెట్టుకొనే లక్ష్మీదేవి రూపులా ఉంది. తిప్పితిప్పి కొడితే వంద రూపాయలుండదు" అంటూ గబగబా కవర్లలో నుండి చీరలన్నీ బయటకి తీసింది.

"ఇదేమిటి...? మంచి మంచి చీరలంటే ఎంత కాస్ట్లీవో ఇస్తారనుకున్నాను. అన్నీ మామూలు సిల్కు చీరలే. ఒక్కోటి నూటయాభై కూడా చేయవు" అన్నది నీరసంగా.

దాని మొహం చూస్తుంటే తిక్కరేగింది నాకు.

"రోజా నలుగురికి కాసులక్కాసులు, బంగారు నాణాలు, వేలకి వేలు పోసి కాస్ట్లీ చీరలు ఇవ్వటానికి వాళ్లేం పిచ్చివాళ్లా? టీవీ ప్రోగ్రాం అంటే ఏదో సరదాగా, స్పోర్టివ్‌గా తీసుకోవాలి కానీ ఇలా గొప్పలకి పోయి వేలకి వేలు తగలేయాలా? ఇంతింత డబ్బు ఖర్చుపెట్టి మేకప్‌లు చేయించుకోలేకపోతే వాళ్లేమన్నా షూటింగ్ జరపమన్నారా? చూడిప్పుడు అనవసరంగా ఎంత ఖర్చయిందో. బ్యూటీషియన్‌కి రెండు వేలు, వినాయకుడి బొమ్మకి రెండొందలు, ఫ్లవర్ వేజ్‌కి నూటయాభై, వాల్ డెకరేటివ్ పీస్‌కో మూడొందలు, వంటామెకో రెండొందలు, రేషన్‌షాపు, స్వీట్ షాపు, కూల్‌డ్రింక్ షాపుల బిల్లులు ఓ వెయ్యి రూపాయలు అయ్యాయి. ఇవన్నీ పెట్టుకొంటే నీకో కాస్ట్లీ చీరతో పాటు, వేలికి రింగో, చెవులకి దిద్దులో వచ్చేవి కదే. చేసిందంతా చేసి ఇప్పుడు అఘోరించడం ఎందుకు... మొదటి నుండి నీ మొండితనం నీదే కానీ నేనెంత చెప్పినా వినిపించుకున్నావా? నీ ఫ్రెండ్ టీవీలో కనపడిందని నువ్వు కనపడాలని తెగ ఉబలాట పడ్డావుగా. ఎలాగైతేనేం నీ కోరిక తీరిందిగా...టీవీలో కనపడటంతో పాటు గోల్డుకాయిన్, చీరలు కొట్టేశావుగా."

అనవసరంగా అంత డబ్బు ఖర్చు పెట్టించిన కోపాన్నంతా ఆ విధంగా వెళ్లగక్కాను.

అదండీ కథ.

టీవీలో కనపడాలనే మా సుబ్బు ఉరఫ్ శుభశ్రీగారి దురద సారీ సరదా అలా తీరింది మరి.

ఫ్రీ

## కొత్త ఇమేజ్

బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన సల్మాన్‌కాన్ ఇప్పుడు హాలీవుడ్‌లో తన చిరునామాని వెదుక్కోవాలనుకుంటున్నాడు. విలియర్డ్ కురోల్ కొత్త చిత్రం మారీగోల్డ్‌లో సల్మాన్‌ఖాన్ నటన గురించే అంతా చర్చించుకుంటున్నారు. 'ఈ చిత్రంతో నా కెరీర్ కొత్త మలుపు తిరుగుతుందని భావిస్తున్నాను. నా ఇమేజ్ కూడా పెరుగుతుంది' అంటున్నాడు సల్మాన్‌ఖాన్. ఈ చిత్రం కోసం బాగానే ఎక్సర్‌సైజ్ చేసినట్టున్నాడు. స్మార్ట్‌గా కూడా కన్పిస్తున్నాడు. ఇంతకీ తన గర్ల్‌ఫ్రెండ్ గురించి మాత్రం చెప్పడం లేదు.

